




# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 03-09-2024 సంపుటి : 06 సంచిక : 345 పేజీలు : 8 వెల : రూ 3-00


## ఏపీకి మరో తుఫాన్ ముప్పు

సెప్టెంబర్ 02 ఏపీకి మరో తుఫాన్ ముప్పువాయుగుండం ప్రభావంతో ఏపీలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అల్లాడిపో తున్నారు. అయితే ఏపీకి మరో ముప్పు రానుంది. ఈ నెల 6, 7 తేదీల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అది తుఫానుగా బలపడి ఉత్తరాంధ్ర, ఒడిశా మధ్య తీరం దాటుతుందని అధికారులు అంచనా వేశారు. అల్పపీడనంపై మరో రెండు రోజుల్లో క్లారిటీ వస్తుందని వాతావరణ కేంద్రం తెలిపింది.





# మునిగిన విజయవాడ..!



## ప్రకాశం బ్యారేజీవద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం
## నాలుగు బోట్లు కొట్టుకు వచ్చినట్లు గుర్తింపు

విజయవాడ,సెప్టెంబర్2 ( విభారె) ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షానికి ప్రకాశం బ్యారేజీ రికార్డు స్థాయిలో వరద వచ్చి చేరుతోంది. దీంతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చిన పరిస్థితి. ఈ వరద ఉధృతిలో పెద్ద ఎత్తున బోట్లు కొట్టుకొస్తున్నాయి. తొలుత ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీ వైపు ఒక బోటు కొట్టుకొచ్చింది. వేగంగా వచ్చిన బోటు ప్రకాశం బ్యారేజీ గేటు 69ను ఢీ కొన్నది. ఈ ఘటనలో గేటు లిఫ్ట్ చేసే ప్రాంతంలో డ్యామేజీ అయ్యింది. అసలేం జరిగిందని తెలుసుకునే లోపే.. మరోసారి నాలుగు బోట్లు కొట్టుకొని వచ్చాయి. దీంతో అధికారులు అనుమానాలు మొదలయ్యాయి. ఇదంతా పనిగట్టుకుని ఎవరైనా చేస్తున్నారా..? లేకుంటే వేరే ప్రాంతం నుంచి వస్తున్నాయా..? దీని వెనుక ఏమైన కుట్ర ఉందా..? ఒకవేళ కుట్రే అయితే ఎవరి పని..? అనేది తెలుసుకునే పనిలో అధికారులు నిమగ్న మయ్యారు. ఈ క్రమంలో గతంలో జరిగిన పరిణామాన్ని అధికారులు, జనాలు గుర్తు తెచ్చుకుంటున్నారు. అప్పట్లో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నివాసాన్ని ముంచేందుకు బోటు అడ్డు తగిలిందంటూ నీటి ప్రవాహాన్ని పెంచే ప్రయత్నం వైసీపీ ప్రభుత్వం చేసిన అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు కూడా బ్యారేజీని డ్యామేజీ చేయడానికి అలాంటి ప్రయత్నం ఏమైనా జరిగిందా..? ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికి ఇలాంటి పనులు చేస్తున్నారా..? ఈ మొత్తం వ్యవహారం ఒకవేళ ఇదే నిజమైతే దీని వెనుకున్న సూత్రదారులు ఎవరు..? పాత్రదారులు ఎవరు..? అనే అనుమానాలు వస్తున్నాయి. ఈ ప్రమాదంపై ఇరిగేషన్, రివర్ కన్జర్వేటివ్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపడుతున్నారు. ఇదిలా ఉంటే.. వరద సహాయక చర్యలపై సోమవారం ఉదయం నుంచే సీఎం చంద్రబాబు రివ్యూలు మొదలుపెట్టారు. ఆహారం, బోట్స్ ఎంతవరకు చేరుకున్నాయి..? అని సమీక్షించారు. మరోవైపు.. ఇతర రాష్ట్రాల నుంచి విజయవాడకు పవర్ బోట్స్ చేరుకుంటున్నాయి. సింగ్ నగర్ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలపై సీఎం రివ్యూ చేస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటల వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ వరద ప్రాంతాల్లో సీఎం పర్యటించిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మళ్లీ ఫీల్డ్ విజిట్‌కు చంద్రబాబు వెళ్లారు. ప్రకాశం బ్యారేజీకి 11 లక్షల 20 వేల క్యూసెక్కులకు వరద చేరుకుంది. బ్యారేజి మొత్తం గేట్లు ఎత్తి కిందకు వరద నీటిని విడుదల చేశారు. బ్యారేజి చరిత్రలో తొలిసారిగా రికార్డ్ స్థాయిలో వరద వచ్చి చేరింది. 2009 అక్టోబర్‌లో 10 లక్షల 94 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. 1903 వ సంవత్సరంలో 10 లక్షల 60 వేలు క్యూసెక్కుల వరద వచ్చి చేరుకుంది. బ్యారేజి దిగువ భాగాన అనేక గ్రామాలు నీట మునిగి పోయాయి. బ్యారేజిపై రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది. ప్రకాశం బ్యారేజ్ గేట్లను పూర్తిగా పైకి ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ఎప్పుడు లేని విధంగా 23.6 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ ఇన్ ఎ÷-లో అవుట్ ఫ్లో 11,25,876 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుకుంది. రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయి వరద వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజ్ గేట్లను పూర్తిగా పైకి ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో రైల్వే అధికారులు అప్రమత్తమ య్యారు. కృష్ణ కెనాల్ జంక్షన్ నుంచి కృష్ణా నది మీదుగా రైళ్లను డెడ్ స్లో చేసి రైల్వే అధికారులు నడుపుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద పోలీసులు రాకపోకల ఆంక్షలు విధించారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై అంబర్ పేట , ఐతవరం కీసర వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరుతోంది. హైదరాబాద్, విజయవాడ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. కృష్ణా జిల్లా నాగాయలంక వద్ద నదిలో పడవ బోల్తా పడింది. ఈ పడవలో నలుగురు మత్స్యకారులు ఉన్నారు. వారి అరుపులు, కేకలు విన్న మత్స్యకార యువత.. నదిలో కొట్టుకుపోతున్న వారిని పడవల్లో వెళ్లి కాపాడారు. నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం తప్పటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## వరదబాధితులకు తక్షణ ఆహారం,నీరు

డ్రోన్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు
డ్రోన్ సర్వీసులపై సిఎం చంద్రబాబు పరిశీలన
తోణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
సహాయక చర్యలను పర్యవేక్షించిన బాబు, లోకేశ్



అమరావతి,సెప్టెంబర్ 2 ఏపీలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం.. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేసింది. వరద ముంపుకు గురైన గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం డ్రోన్లను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారికి డ్రోన్ల ద్వారా ఫుడ్ ప్యాకెట్లు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో డ్రోన్‌లను అధికారులు పరిశీలించారు. అలాగే ఫుడ్ బాస్కెట్స్ తీసుకెళ్లే విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ డెలివరీ విధానాన్ని సీఎంకు ఐ అండ్ ఐ సెక్రటరీ సురేష్ కుమార్ వివరించారు. 8 నుంచి10 కేజీల వరకు ఫుడ్, మెడిసిన్, నీటిని డ్రోన్ల సరఫరా చేయొచ్చని సురేష్ కుమార్ తెలిపారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ సరఫరాపై సుముఖత వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు ఎన్ని వీలుంటే అన్ని ఫుడ్ డెలివరీ డ్రోన్లను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. వరద సహాయ చర్యల కోసం నేవీ హెలీకాప్టర్లు రంగంలోకి దిగాయి. నుంచి మూడు హెలీకాప్టర్లు వచ్చాయి. హకింగ్‌పేట ఎయిర్ బేస్ నుంచి హెలీకాప్టర్లు బయలుదేరాయి. వరద ముంపు ప్రాంతాల్లో హెలీ కాప్టర్ల ద్వారా ఆహారం, మంచినీరు సరఫ రాకు అధికారులు చర్యలు తీసుకు న్నారు.

# విజయవాడ వరద ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన

బాధితులకు ధైర్య వచనాలు
సహాయక చర్యలు ముమ్మరం
అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు





అమరావతి,సెప్టెంబర్ 2:( విభారె) విజయవాడ నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన ముగిసింది. సోమవారం ఉదయం నుంచి ముంపు ప్రాంతాల్లో సుమారు నాలుగు గంటల పాటు నిర్విరామంగా సీఎం పర్యటించారు. యనమలకుదురు, పటమట, రామలింగేశ్వర నగర్, జక్కంపూడి, భవానీపురం తదితర ప్రాంతాల్లో సీఎం పర్యటించి బాధితులతో మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీ దిగువ లోతట్టు ప్రాంతాలు, ఎగువ ప్రాంతాల్లోనూ పర్యటించారు. వాహనం వెళ్లగలిగినంత దూరం అందులో.. మిగిలిన చోట్ల కాలినడక వెళ్లారు. కొన్నిచోట్ల మోకాలి లోతు నీటిలోనూ నడుచుకుంటూ వెళ్లారు. బురదలో కాలినడకనే తన పర్యటనను కొనసాగించారు. మరింత ఎక్కువ నీరు ఉన్న ప్రాంతాల్లో బోటు ద్వారా బాధితుల వద్దకు చేరుకుని వారితో స్వయంగా మాట్లాడి కష్టాలు తెలుసుకున్నారు. బాధితులు చెప్పే ఫిర్యాదుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ఆదుకుంటుందని.. ధైర్యంగా ఉండాలంటూ ప్రజల్లో భరోసా కల్పించారు. ప్రజలను కాపాడే విషయంలో ప్రయత్నాలు ఎక్కడా ఆగకూడదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వరద పరిస్థితిపై సోమవారం ఉదయం విజయవాడ కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఒక్క రాత్రి ధైర్యంగా ఉండాలని ముంపు ప్రాంతాల ప్రజలకు హామీ ఇచ్చానని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ హామీ నిలబెట్టుకునే దిశగా యంత్రాంగం పనిచేయాలన్నారు. ఎంతమందిని రక్షించగలిగామన్నదే మన లక్ష్యం కావాలన్నారు. బోట్లు కూడా కొట్టుకుపోయే సవాళ్లు మన ముందున్నాయన్నారు. బోట్లలో వచ్చిన వారిని తరలించేందుకు బస్సులు సిద్ధంగా ఉంచాలన్నారు.. అవసరమైతే వృద్ధులు, రోగులు ఇబ్బంది పడకుండా హోటళ్లలోనే ఉంచాలని ఆదేశించారు. బాధితుల కోసం కల్యాణ మండపాలు, ఇతర కేంద్రాలు సిద్ధం చేయాలన్నారు. మొత్తం 47 కేంద్రాలు గుర్తించామని సీఎంకు అధికారులు వివరించారు. ఉదయం 8 గంటల కల్లా ఎంత మందికి ఆహారం అందించారని సీఎం ఆరా తీశారు. సుమారు లక్షన్నర మంది వరకు ఆహార పంపిణీ జరిగిందని అధికారులు తెలిపారు. విపత్తు సమయంలో వరద బాధితులు తీసుకునే తాగునీరు ఎంతో ముఖ్యమని చంద్రబాబు చెప్పారు. అందుబాటులో ఉన్న మినరల్ వాటర్ వారి కోసమే కేటాయించాలని అన్నారు. కృష్ణానది కరకట్టపై వెంకటపాలెం వద్ద గండి పడే పరిస్థితిపై సీఎం ఆరా తీశారు. గండిని పూడ్చగలిగామని సీఎంకు అధికారులు వివరించారు.

## విజయవాడ-హైదరాబాద్ మధ్య రవాణా బంద్

**560కి పైగా బస్సులను రద్దు చేసిన ఆర్టీసీ**
**86 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడి**

విజయవాడ,సెప్టెంబర్2 ):రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాలను భారీగా వరదలను ముంచెత్తడంతో టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణ మధ్య రవాణాకు కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పలు చోట్ల భారీగా వరద ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో వెళ్లే బస్సులను రద్దు చేసింది. హైదరాబాద్-విజయవాడ మధ్య 560కి పైగా బస్సులను రద్దు చేస్తూ టీజీఎస్‌ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో 160, వరంగల్ జిల్లాలో 150, రంగారెడ్డి జిల్లాలో 70కిపైగా బస్సులను టీజీఎస్‌ఆర్టీసీ రద్దు చేసింది.కాగా, తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో 86 రైళ్లను రద్దు చేసినట్లుగా దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. వీటితో పాటు 70కి పైగా రైళ్లను దారి మళ్లించినట్లు తెలిపింది. రద్దయిన రైళ్లలో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయని ఎస్‌సీఆర్ వెల్లడించింది. పలు ప్యాసింజర్ రైళ్లను కూడా రద్దుచేసినట్లు తెలిపింది. మరికొన్నింటిని పాక్షికంగా రద్దుచేశామని అధికారులు పేర్కొన్నారు. కాజీపేట -డోర్నకల్-కాజీపేట, డోర్నకల్-విజయవాడ- డోర్నకల్, విజయవాడ- గుంటూరు-విజయవాడ రైళ్లను రద్దు చేయగా, ఢిల్లీ-సెంట్రల్ చెన్నై, దానాపూర్-బెంగళూరు రైళ్లను దారి మళ్లించారు. అదేవిధంగా రాయపురం-పటేల్ నగర్, హజ్రత్ నిజాముద్దీన్-రేణిగుంట రైళ్లను మరోమార్గంలో మళ్లించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో ఎక్కడ చూసిన వాగులు, వంకలు పోటెత్తాయి. వర్షాలు, వరదల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 86 రైళ్లను రద్దు చేసింది.

## ప్రజలను కాపాడడమే తక్షణ కర్తవ్యం

**క్షేత్రస్థాయిలో సిఎం, మంత్రుల పర్యవేక్షణ**
**మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి**

విజయవాడ,సెప్టెంబర్ 2 : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి పరిమితులు లేకుండా ప్రజల అవసరాలు తీర్చడవే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. విజయవాడలో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం ఇక్కడే ఉంచి పర్యవేక్షిస్తున్నారన్నారు. ఒక మంత్రికి రెండు డివిజన్లు చొప్పున సమన్వయ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. విజయవాడలో పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి లోకేశ్ ఉండి సమన్వయం చేస్తున్నారన్నారు. ఊహించనిస్థాయిలో వరద వచ్చింది. గత ఐదేళ్లలో కాలువల్లో పూడికలు తీయకపోవడం, నదిలో కలిసే మార్గాలన్నీ మూసుకుపోయినా నిర్లక్ష్యంగా ఉండటంతో ఈ పరిస్థితి వచ్చింది. వరద ఉధృతి తగ్గించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. బాధితులకు సంబంధించిన ఆహార సరఫరా, సహాయ, పునరావాస కార్యక్రమాలకు షరతులు, నిబంధనలు అడ్డురాకూడదని అధికారులను సీఎం ఆదేశించారు.

# సంపాదకీయం

మంగళవారం 03-09-2024

## ప్రకృతి విలయంపై కళ్లు తెరవాలి!

ఐదారేళ్ల కోసారి ప్రకృతి విలయం సృష్టిస్తోంది. చార్‌ధామ్ తరవాత వయనాడ్..ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో విలయం చూస్తుంటే...మనలో కించిత్ మార్పు కూడా కానరావడం లేదు. ప్రకృతి విధ్వంసంపై ఎవరూ మాట్లాడడం లేదు. ప్రజలు కూడా ఎందుకు ఇలా జరుగుతుందో అన్న బాధలేదు. ప్రకృతిని మరమంతా విధ్వంసం చేస్తున్నాం. చెరువులను వదలకుండా వెంటచర్లు వేశారు. నదీతీర ప్రాంతాలను ధ్వంసం చేశారు. అలాగే చెట్టుచేమలను ధ్వంసం చేశాం. కొండలు గుట్టలు ధ్వంసం చేశాం. ఇవన్నీ మనం చేశామా అని చాలామంది ఆశ్చర్య పోవచ్చు. కానీ పచ్చి నిజమని ప్రకృతి మనలను పదేపదే హెచ్చరిస్తోంది. తన ప్రతాపం చూపుతోంది. అయినా మానం మారడం లేదు. తెలంగాణలో హైడ్రాతో ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెరువులను ఆక్రమించిన వారి భరతం పడుతోంది. దీనిపైనా అక్కసు వెళ్లగక్కుతున్నారు. చెరువులను ఆక్రమించిన పేదలు మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర రెడ్డి, అక్బరుద్దీన్, కెటిఆర్ లాంటి వారి జోలికి వెళ్లవద్దని కోరుతున్నారు. ధనవంతులైన ప్రజలు మాత్రం చట్ట ప్రకారం ఇళ్లు కొనుగోళ్లు చేస్తూ ప్రభుత్వానికి పైసా కూడా తక్కువ కాకుండా పన్నుల కడుతున్నారు. ఈ క్రమంలో మనమంతా చెరువుల పునరుద్దరణకు పూనుకోవాలి. ప్రకృతి విలయానికి కారణమవుతున్న ఇసుక దోపిడీని అరికట్టాలి. కొండలు గుట్టలు ధ్వంసం చేయడం ఆపాలి. చెట్లను, అడవులను నరకకుండా చూడాలి. ఇదంతా కూడా ప్రజలే చేయాలి. వారే స్వయంగా రంగంలోకి దిగాలి. తమ వనరులను పేదలైన నాయకులు దోచుకోకుండా చూసుకోవాలి. లేకుంటే ప్రస్తుతం వయనాడ్, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ప్రకృతి విలయం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు వణికి పోతున్నాయి. కనివినీ ఎరుగని రీతిలో గత రెండు రోజులుగా వర్షాలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలకు అతలాకుతలం అవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. కాలనీలకు కాలనీలే వరద నీటిలో చిక్కుకుపోతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా, నిజామాబాద్ తదితర జిల్లాల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. నదులు, ఏరులు, వాగులన్నీ పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక జనం బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల వాసులు పూర్తిగా పునరావాస కేంద్రాలకు చేరారు. సమయానికి ఆహారం, నీరు, నిద్ర అన్నీ కరువై అలమటిస్తున్నారు. ఊళ్లన్నీ చెరువులుగా మారాయి. చెరువులు తెగిపోయాయి. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో జలవిలయం ప్రకంపనలు సృష్టిస్తోంది. వరద నీటి ఉధృతితో పలు పట్టణాల్లోని కాలనీల్లోని పలు ఇళ్లు నీట మునిగాయి. ప్రజలు ఆకలి కేకలతో అల్లాడుతున్నారు. పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. రైళ్లు రద్దు కావడంతోపాటు ఆర్టీసీ బస్సులను కూడా నిలిపివేశారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. విజయవాడ జలదిగ్బంధంలో ఉండిపోయింది. ఖమ్మం జిల్లా బాగా దెబ్బతింది. ఇప్పటికే ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. ఖమ్మం జిల్లాలో వాగులో పడి ఓ తండ్రీ కూతురు కొట్టుకు పోయారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. కేసముద్రం- ఇంటికన్నె మార్గంలోని రైల్వే ట్రాక్ పూర్తిగా ధ్వంసమైంది. కేసముద్రం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లను నిలిపివేశారు. ప్రయాణికులకు పోలీసులు అల్పాహారం, నీరు అందించారు. ఈ రైల్వే ట్రాక్ పూర్తిస్థాయిలో దెబ్బతింది. రైల్వే ట్రాక్ కింద ఉండే కంకర మొత్తం వరదకు కొట్టుకుపోయింది. దీంతో విజయవాడ-కాజీపేట మార్గంలో పలు రైళ్లు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు 24 రైళ్లను నిలిపివేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసింది. రైల్వే అధికారులు కేసముద్రం- ఇంటికన్నె మార్గంలోని రైల్వే ట్రాక్‌ను పునరుద్ధరిస్తున్నారు. రైల్వేకు సంబంధించిన ట్రాక్‌లు కొట్టుకుపోవడంతో రైళ్ల రాకపోకలు తీవ్ర అంతరాయం కలిగింది. కాజీపేట, రాయనపాడులో ట్రాక్‌లు తెగిపోవడం రైళ్లు నిలిపివేశారు. 80 రైళ్లు రద్దు, మరో 48 రైళ్లను దారి మళ్లించారు. హైదరాబాద్ -విజయవాడ రూట్‌లోనే అత్యధిక రైళ్లు రద్దయ్యాయి. పలు ప్రాంతాలకు వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. కుండపోత వర్షాలతో ఏపీ అతలాకుతలం అయింది. మరో 24 గంటల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నాలుగు జిల్లాలకు రెడ్ అలర్ట్, మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. గుంటూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. తీరం వెంబడి 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోవైపు, విజయవాడలోని సింగ్ నగర్ లో పరిస్థితి దారుణంగా ఉంది. వరద దాటే ప్రయత్నం చేసిన ఓ మహిళ నీటిని దాటుతూ గుండెపోటుతో మృతి చెందింది. మొత్తం జలమయం కావడంతో సింగ్ నగర్ లో జనజీవనం స్తంభించింది. సింహాద్రి, మచిలీపట్నం, గౌతమి, సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, గంగా-కావేరి, చార్మినార్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసింది. వాయుగుండం తీరం దాటినప్పటికీ వర్షాలు వీడలేదు. తెలంగాణను శనివారం కూడా భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఏపీలో వర్షాలు కొద్దిగా తగ్గుముఖం పట్టినప్పటికీ గత రెండ్రోజులుగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా ఐతవరం వద్ద రోడ్డుపైకి వరద నీరు రావడంతో ప్రయాణాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాంతో, విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. వరంగల్ వద్ద రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో ఇప్పటికే రైళ్లు నిలిచిపోయాయి. అటు రైళ్లలో వెళ్లే మార్గం లేక, ఇటు బస్సులు కూడా నడవక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు కూడా నిలిచిపోగా ఆర్టీసీ బస్సులు కూడా నిలిచిపోవడంతో ప్రయాణికులు విజయవాడ బస్టాండ్ లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నష్టం అంచనా ఎంతన్నది ఇప్పుడే చెప్పలేం. కొన్నిరోజులు పోతే నష్టం అంచనా వేయగలం.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం...

జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్.





కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 విభారె న్యూస్..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 96 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ... 1)కర్నూలు సచివాలయం లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలు, తాండ్రపాడు కు చెందిన మహేశ్వరెడ్డి అనే వ్యక్తి రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేశాడని తుగ్గలి మండలం ,మారెల్ల గ్రామానికి చెందిన లక్ష్మన్న ఫిర్యాదు చేశారు. 2) మధుబాబు అను వ్యక్తి మా పొలాన్ని ఆన్ లైన్ చేసి,పాస్ బుక్ ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశాడని కోడుమూరు, కొండపేటకు చెందిన కాశిం సాహెచ్ ఫిర్యాదు చేశారు. 3) కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని చర్యలు తీసుకోవాలని కర్నూలు కు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. 4)మా అనుమతి లేకుండా ఎటువంటి సమాచారం,నోటీసు ఇవ్వకుండా పూర్వీకుల నుండి ఉన్న పశువుల పాక రాతి గోడను జెసిబి తో దౌర్జన్యంగా ధ్వంసం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండలం, కారుమంచి గ్రామానికి చెందిన తిక్క నాగప్ప ఫిర్యాదు చేశారు. 5) గూడురు,చనుగొండ్ల గ్రామంలోని మా 3 ఎకరాలలో సాగు చేసిన కందిపంటను గొర్రెలతో మేపి పంట నష్టం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, స్టాంటన్ పురం కు చెందిన ఆనంద్ కుమార్ ఫిర్యాదు చేశారు. 6) లక్ష్మీపురం గ్రామ శివారులోని 2 ఎకరాల 76 సెంట్ల భూమిని సర్వేయర్ కొలచి హద్దులు పాతితే, ప్రక్క పొలం వారు హద్దులు జరిపి గొడవలు సృష్టిస్తున్నారని వారి పై చర్యలు తీసుకోవాలని డోన్ కు చెందిన నవీన్ కుమార్ ఫిర్యాదు చేశారు. 7)నా భర్త, అత్త లు కలిసి నా పుట్టింటి నుండి అదనపు కట్నం తీసుకురావాలని నన్ను వేధింపులకు గురి చేస్తున్నారని పిల్లలకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కర్నూలు బుధవారపేటకు చెందిన పార్వతి ఫిర్యాదు చేశారు. 8) విత్తనం వేసిన పొలం ను దౌర్జన్యంగా ట్రాక్టర్ తో దున్నించిన వారి పై చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ కు చెందిన గోవిందమ్మ ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు,సిఐ శివశంకర్, ఎస్సై పెద్దయ్య నాయుడు పాల్గొన్నారు.

# హైడ్రాతో వెన్నులో వణుకు

హైదరాబాద్, ఆగస్టు 2, తెలంగాణలో ఇప్పుడు హైడ్రా పేరు చెబితే చాలు ఆక్రమణదారుల వెన్నులో వణుకు పుడుతోంది. నగరంలో చెరువులను ఆక్రమించిన బడా బాబులు, రాజకీయనేతల బంధువులు, చివరికి అధికార పార్టీ నేతల్లో సైతం హైడ్రా తీరుతో ఆందోళన నెలకొంది. ఇదిలా ఉంటే కూల్చివేతలలో భాగంగా ఇప్పటి వరకూ ఔ కన్వెన్షన్ వంటి సెలబ్రెటీల ఆస్తులనే కాదు, పేదల గుడిసెలు, ఇళ్లు సైతం హైడ్రా బుల్డోజర్ దెబ్బకు నేలమట్టమైయ్యాయి. ఇంతలా చెరువులు ప్రక్షాళన పేరుతో దూసుకుపోతున్న హైడ్రాపై జనం ఏమంటున్నారు. హైదరాబాద్ నగరవాసుల స్పందన ఎలా ఉందంటే.. "చెరువులు ఆక్రమణలు కూల్చివేడయం మంచి నిర్ణయమే. కానీ పెద్ద భవనాలు వరకూ ఓకే. కానీ చిన్న ఇళ్లు నిర్మించుకుని గత ఇరవై ఏళ్లుగా అక్కడే జీవిస్తున్న కుటుంబాల పరిస్దితి ప్రభుత్వం ఆలోచన చేయాలి. తెలంగాణ రాకముందు ఉన్న పేదవారి ఇళ్లను వదిలేయాలి. రాష్ట్రం ఏర్పాటు తరువాత ఏర్పడ్డ కట్టడాలను టార్గెట్ చేస్తే బాగుంటుంది. గుడిసెల్లో జీవించేవారు ఇళ్లు కూలిపోతే రోడ్డున పడతారు. వారి గురించి ప్రభుత్వం ఆలోచన చేయాలి. రాజకీయ కక్షతో చేస్తున్నట్లు ఎక్కడా అనిపించడం లేదు. జనం ప్రయోజనం కోసమే హైడ్రా అనిపిస్తుంది. వరద ముంపు సమస్య ఉండదు" - వెంకటేశ్వరరావు, హైదరాబాద్."హైడ్రా పనితీరు అద్భుతంగా ఉంది. ఇది తప్పుదోవ పట్టకుండా చూడాలి. తెలంగాణకు చెరువులు జీవనాధారం. చెరువులు లేనిదే తెలంగాణ లేదు. కాబట్టి చెరువులు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా ఇలాగే కొనసాగించాలి. ఏకపక్షంగా వెళుతున్నాడా.. లేదా అని ఇప్పుడే చెప్పలేం. ప్రతి ఒక్కరూ హైడ్రా పనులను గమనిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల అవినీతికి లొంగకుండా ఇలా ముందుకు వెళతారా.. లేదా అనేది ముందు ముందు చూడాలి" - క్రిష్ణ, నగరవాసి"హైదరాబాద్ లో కాస్త వర్షం పడితే చాలు రోడ్లు నీటితో నిండిపోతున్నాయి. చాలా ఇబ్బంది పడుతున్నాము. నాళాలు ఆక్రమించి కట్టిన అక్రమ కట్టడాల వల్లనే వరద ముంపు నగరంలో విపరీతంగా పెరిగింది. ఆక్రమించిన వాళ్లకు కూల్చేస్తుంటే కోపం రావడం సహజం. విమర్శలు హైడ్రా పట్టించుకోకుండా ముందుకు వెళ్లాలని కోరుతున్నాము. నాగార్జున వంటి హీరో ఆక్రమణలే కూల్చేశారంటే పారదర్శకంగా ముందుకు వెళ్లున్నారు అనిపిస్తోంది. ఎవరికి భయపడకుండా రంగనాథ్ ధైర్యంగా ముందుకు వెళ్తుండటం మంచి పరిణామం" - అమ్జాద్"హైడ్రా యాక్షన్ చాలా బాగుంది. రాజకీయాలు అంటేనే విమర్శలు సహజం. ఇది డేరింగ్ నిర్ణయం. ప్రజల మద్దతు కచ్చితంగా ఉంది. హైడ్రా దూకుడు చూస్తుంటే ఇలా కొనసాగిస్తుందనే అనుకుంటున్నాం. ఇప్పుడు హైదరాబాద్ లో ప్రభుత్వ భూమి కబ్జా చేయాలంటే భయపడుతున్నారు. భవిష్యత్ లో కూడా ఆక్రమణలకు ఎవరూ పూనుకోరు. చెరువులను పూడి ఇళ్లు కట్టుకుంటే భవిష్యత్ లో అది పేదవారికైనా, సెలబ్రెటీలకైనా ఎవరికైనా ప్రమాదమే. ఆక్రమణదారులు ఎవరైనా చర్యలు తీసుకోవడం తప్పులేదు.సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు తిరుపతి రెడ్డికే హైడ్రా నోటీసులు ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ నాయకుడు? ఆక్రమణలే మొదట కూల్చేసింది. కాపాడుకోవాలి అంటే సొంత పార్టీ నేతలను ఎవరూ టార్గెట్ చేయరుకదా. మొదట్లో హైడ్రా ఏం చేస్తుందిలే అనుకున్నారు ఆక్రమణదారులు. ఇప్పుడు గుండెల్లో హడల్ పుడుతుంది.ఇనాళ్లు ప్రభుత్వ నిర్ణయాలతో పేదవాళ్లే దెబ్బతింటారు. అనే అభిప్రాయాం అందరిలో ఉండేది. ఇప్పుడు హైడ్రా చర్యలు తీసుకుంటున్న విధానం చూస్తుంటే పేదలు, పెద్దవాళ్లు అంతా ఒకటే అనే భావన కలుగుతోంది" అని ప్రజలు చెబుతున్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి,ఆగస్టు 2, రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలెర్ట్ ఉన్నదని యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా తెలిపారు. వర్షాలు, వరదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన రెండు రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకున్నామని, రానున్న రెండు రోజులు ఇదే స్ఫూర్తితో అప్రమత్తంగా ఉండాలని ఈ రెండు రోజులు చాలా ముఖ్యమని అన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పంచాయతి, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షం ఎపుడు వస్తుందో తెలీదని ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు, రహదారులపై నీళ్ళు వస్తే ప్రయాణాలు నియంత్రణకు ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాలల్లో పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ముంపు గ్రామాల జాబితాను సిద్దం చేసుకుని తగు జాగ్రత్తలు పాటించే విధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా లూజు వైర్లు గుర్తించి ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిండు కున్న జలాశయాలకు వీక్షణకు ప్రజలు వస్తుంటారని నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పొంగే వాగులు, రహదారులపై వాహనాలు రాకపోకలు నియంత్రణ చేయాన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్ నందు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదేని అత్యవసర సేవలకు ప్రజలు కంట్రోల్ రూము నంబర్స్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు.ప్రసవానికి దగ్గర తేదీ ఉన్న మహిళలను ఆసుపత్రులకు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. 102, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాళేశ్వరానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతి, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఈవో బాలగంగాధర్ సంస్థకు అందించిన సేవలు మరువలేనివి....

- పదవీ విరమణ పొందిన బాలగంగాధర్....




ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2 విభారె న్యూస్..స్థానిక టౌన్ బ్యాంకు నందు సీఈవో బాలగంగాధర్ సంస్థకు అందించిన సేవలు ఎన్నటికీ మరువలేమని టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, కొమ్ము రాజశేఖర్, బి. ఎన్. నాగరాజు, మున్సిపల్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ లు బాలగంగాధర్ ను కొనియాడారు.31 వ తేదీ శనివారము టౌన్ బ్యాంకు సీఈఓ గా బాలగంగాధర్ పదవి విరమణ చేశారు. బాలగంగాధర్ ను బ్యాంకు మాజీ పాలకవర్గంతో పాటు సహచర ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, సిబ్బంది పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్యాంకు మాజీ ఛైర్మన్లు, నజీర్ అహ్మద్, రిటైర్డ్ లెక్చరర్ బి. సంజీవరావు, కోసిగి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించిన టౌన్ బ్యాంకు ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. బాలగంగాధర్ 34 ఏళ్లుగా టౌన్ బ్యాంకులో సేవలు అందించి ఖాతాదారులు, ప్రజల మన్ననలను పొందారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్లు తట్టే బుడ్డప్ప, ఏ మాధవులు, మనియార్ వహీద్, రజాక్, రంగన్న, శ్రీరాములు, మహదేవప్ప, రియల్ ఎస్టేట్ వ్యాపారి ఉప్పర రంగన్న,సిబ్బంది కళావతి, శోభ, ఆడిటర్ తురాబుద్ధిన్ లు తదితరులు పాల్గొన్నారు...

## గోమాత (ఆవు) కు ప్రసవం చేసిన అంగన్వాడి టీచర్స్..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2 విభారె న్యూస్..నోరులేని జీవులలో గోమాత ఒకటి. అటువంటి గోమాతకు మానవతా దృక్పథంతో ప్రసవం చేసిన అంగన్వాడీ టీచర్స్ స్థానిక మారెమ్మ దేవాలయం దగ్గర గోమాత ప్రసవంతో బాధపడుతూ ఉంటే అక్కడి స్థానికులు సిడిపివో సఫరునీస మేడం కు విషయం తెలుపగా వెంటనే అంగన్వాడి టీచర్స్ కు 2వ సెక్టరు అంగన్వాడీ టీచర్లకు ప్రశం చేయించమని ఆదేశాలిచ్చి పంపించారు. సిడిపిఓ ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్స్ గోవర్ధనమ్మ, అస్మత్ బేగం, సూపర్వైజర్ జరీనా లు పాల్గొని గోమాత ప్రసవం ను గావించారు. అక్కడున్న ఏరియా ప్రజలు సిడిపిఓ మేడంకు అంగన్వాడి టీచర్లకు అభినందనలు తెలియజేశారు.



# జగన్ కు ఆర్ ఆర్ ఆర్ ఉచ్చు



ఏలూరు, సెప్టెంబర్ 2 వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెడకు రాజుగారి ఉచ్చు బిగుసుకోబోతుందా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అలానే ఉంది పరిస్థితి. అప్పటి ఎంపీ, ఇప్పటి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంటే తెలియని వారు ఎవ్వరూ ఉండరు. వైసీపీ హయాంలో ఆయనపై రాజద్రోహం కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గుంటూరు సీఐడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. కస్టడీలో తనను తీవ్రంగా హింసించారన్నది ఆర్‌ఆర్‌ఆర్ ఆరోపణ.. నిజానికి ఆయన ఈ ఆరోపణలు ఎప్పటి నుంచో చేస్తున్నారు. కానీ కేసు మాత్రం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీకి కొద్ది రోజుల క్రితం కంప్లైంట్ చేశారు రఘురామ. తనపై ఏకంగా హత్యాయత్నం జరిగిందని ఆరోపించారు ఆయన. దీనిపైనే ఇప్పుడు విచారణ జరగబోతుంది. అందుకే ఈ కేసులో అప్పుడు సీఎంగా ఉన్న జగన్ కూడా విచారణ ఎదుర్కోబోతున్నారన్న చర్చ నడుస్తోంది.. ఈ కేసులో నిందితుల లిస్ట్‌లో ఉన్నదెవరో తెలుసా? మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అప్పటి సీఐడీ డీజీ సునీల్ కుమార్.. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఖాఖీ ఆంజనేయులు. గుంటూరు సీఐడీ ఏఎస్పి విజయ్ పాల్.. అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి.. ఇప్పటికే వీరందరికి నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది. నిజానికి విజయ్‌పాల్‌కు ఇప్పటికే నోటీసులు అందాయి. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో.. ఆయన ఇంటికి నోటీసులు పంపారు. అప్పుడు ఆయనే విచారణాధికారిగా ఉన్నారు. విచారణ ఎలా జరిగింది? సాక్ష్యాలు ఏం సేకరించారు? ఇలా అన్ని ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు అధికారులు. కానీ ఆయన అబ్‌స్కాండ్‌లో ఉన్నారు. ఇక ఈ కేసులో ప్రభావతి పేరు చేర్చడం కూడా ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఎందుకంటే అప్పుడు రఘురామకు వైద్య పరీక్షల అనంతరం తప్పుడు నివేదిక ఇచ్చారని ఆమెపై ఆరోపణలు చేస్తున్నారు రఘురామ. ఒక్కసారి ఆయన అందుబాటులోకి వస్తే కేస్ సీనే మారిపోనుంది. హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి విజయవాడకు ఎలా తీసుకొచ్చారు. ఎన్ని వాహనాలు వినియోగించారు? విచారణ ఎలా జరిగింది? విచారణలో పాల్గొన్న అధికారుల పేర్లేంటి? వారి హోదాలేంటి? ఇలా ప్రతి ఒక్క అంశంపై ఫోకస్ చేయనున్నారు ప్రస్తుత విచారణ అధికారులు.. కేసు నమోదు అయ్యింది.. పోలీసులు విచారణ జరిపారు. మరి ఇందులో అప్పుడు సీఎంగా ఉన్న వైఎస్ జగన్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఏంటి అనేదేగా మా ప్రశ్న.. సీఎం జగన్ ప్రమేయంతోనే ఇదంతా జరిగిందంటున్నారు రఘురామ. ఉదయం తొమ్మిది గంటలకు కంప్లైంట్ ఇస్తే.. పది గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గంటన్నర టైమ్‌లో మంగళగిరి నుంచి హైదరాబాద్ వచ్చి అరెస్ట్ చేశారు. ఇదంతా మాములుగా జరిగిందని తాను అనుకోవడం లేదంటున్నారు రఘురామ. సీఎం నేరుగా ఇన్‌వాల్వ్ అయ్యారు కాబట్టే ఇదంతా జరిగిందంటున్నారు. అంతేకాదు తనను హింసించడం వెనక జగన్ హస్తం కూడా ఉందంటున్నారు. అందుకే కేసులో ఆయన పేరును కూడా చేర్చారు.. ఇన్ని కారణాలు ఉన్నాయి కాబట్టే ఇప్పుడు ఆయనకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉంది. ఒక్కసారి నోటీసులు వస్తే.. ఆయన విచారణకు హాజరవుతారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది. ఎందుకంటే అధికారం పోయిన తర్వాత జగన్‌పై డైరెక్ట్‌గా నమోదైన కేసు ఇదే.. అందుకే పోలీసుల విచారణపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. నిజంగానే పోలీసులు జగన్‌కు నోటీసులు జారీ అయితే జగన్ రియాక్షన్ ఎలా ఉంటుంది? వైసీపీ నేతల రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.. ఇది కచ్చితంగా కక్షపూరిత కేసే అనే ఆరోపణలు మనం వింటాం.. అందులో ఎలాంటి డౌట్ లేదు. కానీ ఇక్కడ రఘురామ కూడా ఇదే వర్షన్ చెబుతున్నారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు తనపై కక్షపూరితంగా రాజద్రోహం కేసు నమోదు చేశారని.. హింసించారని.. మరి ఏది నిజం? ఏది అబద్ధం అనేది విచారణలో తేలనుంది

# ఆ ఇద్దరు ఐపీఎస్ లకు జెత్వానీ చిక్కులు

విజయవాడ, సెప్టెంబర్ 2, చట్టం ఎవరికీ చుట్టం కాదు.. తగిన సమయంలో అందరికీ సమానంగా వడ్డించేస్తుంది? వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఏపీలో ప్రస్తుతం చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి అటు వైసీపీ నేతలు.. ఇటు పోలీసు, రెవెన్యూ శాఖల్లో ఉన్నతస్థాయి అధికారులకు చిక్కులు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంలో కొందరు వైసీపీ నేతల ఒత్తిళ్ల వల్ల?. అవసరానికి మించి ఓవర్ చేశారని పలువురు ఐపీఎస్‌లపై ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో కొందరికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా ప్రభుత్వం పక్కనబెట్టగా, మరికొందరు వివిధ కేసులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటికే ఫైళ్ల దహనం, ల్యాండ్, శాండ్, ఫైబర్‌నెట్, లిక్కర్ స్కాంల్లో అధికారులపై చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండగా, కొందరు ఐపీఎస్ అధికారులపైనా ఉచ్చు బిగించేలా తాజాగా అడుగులు పడుతుండటం రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో నిబంధనలను పక్కన పెట్టి వైసీపీ చట్టాన్ని అమలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 16 మంది సీనియర్ అధికారులకు పోస్టింగ్‌లు లేకుండా ప్రభుత్వం పక్కన పెట్టింది. వీరు రోజూ డీజీపీ ఆఫీసుకు రావాలని మెమో జారీ చేసింది సర్కార్. ఈ ఆదేశాలను కొందరు మొక్కుబడిగా పాటిస్తుండగా, మరికొందరు ప్రభుత్వం ఏం చేస్తుందో చూద్దామన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తున్న సమయంలోనే మరో సంచలన విషయం బయటపడింది. వైసీపీ నేతల సూచనల ప్రకారం ముంబైకి చెందిన ఓ సినీ నటిని ఫిబ్రవరిలో అరెస్టు చేసి, ముంబైలో నమోదైన ఓ కేసును సెటిల్ చేశారనేది ప్రస్తుతం సంచలనానికి కారణమైంది. ఈ అంశంలో గతంలో విజయవాడలో పోలీసు కమిషనర్‌గా పని చేసిన కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నిపై తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ నేతల సూచనల ప్రకారం కేసు నమోదు చేయడం, ముంబైలో పారిశ్రామికవేత్తకు మేలు జరిగేలా అక్కడి కేసు ఉపసంహరణ తర్వాత ఇక్కడి కేసును మూసేసినట్లు చెబుతున్నారు. ఆ విషయంలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ పాత్రధారిగా ప్రభుత్వానికి ఫిర్యాదు అందగా, సూత్రధారులుగా వైసీపీలోని అగ్ర నేతలపైనే ఆరోపణలు వస్తున్నాయి. ఐతే కేసులో నేరుగా ఇన్‌వాల్వ్ అయిన ఐపీఎస్ ఆఫీసర్లు కాంతిరాణా, విశాల్ గున్ని చుట్టూ ఉచ్చు బిగిస్తోంది ప్రభుత్వం. తనను తప్పుడు ఫిర్యాదు ఆధారంగా కనీస విచారణ చేయకుండా అరెస్టు చేసిన పోలీసులు.. రిమాండ్‌లో ఉండగా హింసించారని ముంబై నటి కాదంబరి జెత్వాని విజయవాడ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఐపీఎస్ అధికారులపై విచారణకు ఆదేశించింది ప్రభుత్వం. ఈ అంశంలో ఆగస్టు ఒకటో తేదీన ముంబైలో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసిన కాదంబరి జెత్వాని? ఆ తర్వాత విజయవాడ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు పంపారు. ఇప్పుడు ఈ విషయమై వాంగ్మూలం ఇచ్చేందుకు నేరుగా విజయవాడ వచ్చారు. దీంతో రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు ఎక్కువయ్యాయి. తనకు సన్నిహితంగా వ్యవహరించిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను అడ్డుపెట్టుకుని అప్పటి వైసీపీ పెద్దలు ముంబైకి చెందిన ఓ పారిశ్రామికవేత్తపై తాను పెట్టిన కేసును ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపిస్తున్నారు కాదంబరి జెత్వాని. ఇందుకోసం తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన తనపై తప్పుడు కేసు బనాయించారని ఆమె అభియోగం. అయితే అప్పట్లో ప్రభుత్వ పెద్దలు చెప్పడంతో ఆ కేసును సీరియస్‌గా తీసుకుని అప్పటి కమిషనర్ కాంతిరాణా, డీసీపీ విశాల్ గున్ని ఇప్పుడు చిక్కుల్లో పడ్డారు. తెరవెనుక బాగోతం ఒక్కొక్కటిగా వెలుగు చూస్తుండటంతో ప్రభుత్వం వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందననే ఉత్కంఠ పెరిగిపోతోంది. ముంబై నటి కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్‌లు కాంతిరాణా తాతా, విశాల్ గున్నిలకు పని లేని శిక్ష విధించింది ప్రభుత్వం. వీరిద్దరూ ప్రతిరోజూ డీజీపీ ఆఫీసుకు వచ్చి సంతకాలు చేయాల్సి వుండగా, ముంబై నటి కేసు వెలుగు చూశాక కాంతిరాణా తాతా డీజీపీ ఆఫీసుకు రాలేదని చెబుతున్నారు. ఇదే సమయంలో విశాఖలో ఉంటున్న విశాల్ గున్ని విజయవాడ వచ్చినా డీజీపీ ఆఫీసుకు వెళ్లలేదని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ ఇద్దరిని పక్కన పెట్టిన ప్రభుత్వం? తాజా కేసుతో ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఐపీఎస్ అధికారులపై ఏ చర్య తీసుకోవాలన్నా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే జీఏడీకే అధికారం ఉంది. ఈ విషయంలో డీజీపీ కూడా ఏం చేయలేరని అంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఐపీఎస్‌లపై చాలా సీరియస్‌గా ఉంది. కంచె చేను మేసినట్లు చట్టాన్ని పరిరక్షించాల్సిన వారే గీత దాటి వ్యవహరిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సివస్తోందని ఇప్పటికే సంకేతాలు పంపింది ప్రభుత్వం. దీంతో ముంబై నటి జెత్వానీ ఫిర్యాదుతో ఐపీఎస్‌లు కాంతిరాణా, విశాల్ గున్నిపై వేటు వేసేలా ఫైల్ సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా ప్రభుత్వం పక్కన పెట్టిన 16 మందిలో ఇద్దరు ముంబై హీరోయిన్ కేసులో బుక్కైపోగా, మరికొందరిపైనా కేసులు పెట్టేందుకు అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి 16 ఐపీఎస్ అధికారులు దినదిన గండంగా గడపాల్సి వస్తోందంటున్నారు.

# వరదనీరు లో రాయనపాడు రైల్వే స్టేషన్

విజయవాడ ఉమ్మడి కృష్ణా జిల్లాలో కురిసిన భారీ వర్షం విజయవాడ సమీపంలోని రాయ నపాడు రైల్వేస్టేషన్ ను ముంచేసింది. రైల్వే ట్రాక్, స్టేషన్ పరిసరాలన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ పై సుమారు ఆరు అడుగుల ఎత్తులో వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. రైల్వే ట్రాక్ పెద్ద ఎత్తున కోసుకు పోయింది. హైద రాబాద్, విశాఖ వైపు వెళ్లే రైళ్లన్నీ స్టేషన్ లో నిలిపేశారు. హైద రాబాద్ నుంచి విశాఖ వెళ్లే గోదావరి, హైదరాబాద్ – చెన్నై వెళ్లే చార్మినార్ ఎక్స్ ప్రెస్‌లను రైల్వే శాఖ నిలిపేసింది. ప్రయాణికులను రైల్వేస్టేషన్ నుంచి పడవల్లో గుంటుపల్లికి తరలించి అక్కడి నుంచి 50బస్సుల్లో విజయవాడకు పంపించారు.

# నేల కూలిన వాణిజ్య కాంప్లెక్స్

పిఠాపురం,పిఠాపురం పట్టణం గోల్డ్ మార్కెట్ నందు ఎడతెరేపు లేకుండా వర్షాలు కురుస్తున్న కారణంగా ఎంతో పురాతనమైన బిల్డింగ్ అనేక వ్యాపారాలకు నిలయమేన కాంప్లెక్స్ సుమారు ఉదయం 9 గంటల సమయంలో కుప్ప కూలింది. ఈ ప్రమాదం జరిగి న సమయంలో షాపులు తెరచి లేకపోవడంతో చాలామందికి ప్రమా దం తప్పింది. ఇకనైనా మున్సిపల్ అధికారులు ఇటువంటి పురాతన భవనాలపై ప్రత్యేక దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని చిన్నచితక వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తపరిచారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎమ్మెల్సీ, ఎంపీల వరకు ఓకే...

విజయవాడ, సెప్టెంబర్ 2, వైసీపీ విషయంలో చంద్రబాబు స్కెచ్ ఏంటి? పూర్తిగా నిర్వీర్యం చేస్తారా? లేకుంటే అవసరం మేరకు మాత్రమే చేరికలను ప్రోత్సహిస్తారా? అసలు ఆయన మదిలో ఏముంది? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించింది. 175 స్థానాలకు గాను 164 చోట్ల విజయం సొంతం చేసుకుంది. వైసీపీని కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం చేసింది. ఆ పార్టీకి చెందిన పెద్దపెద్ద నాయకులు సైతం ఓడిపోయారు. తాజా మాజీ మంత్రుల్లో ఒక్కరు మాత్రమే గెలిచారు. గెలిచిన 11 సీట్లలో ముగ్గురు మాత్రమే ఎంతో కొంత పవర్ ఫుల్. మిగతావారు పెద్ద లెక్క కూడా కాదు. అయితే ఇప్పుడు వైసీపీని క్లోజ్ చేయాలని ప్రత్యర్థులు భావిస్తారు. అయితే ఈ విషయంలో చంద్రబాబు వేరే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. కేవలం అవసరం మేరకు మాత్రమే వైసిపి నేతలను పార్టీలో చేర్చుకోవాలని చూస్తున్నారు. అవసరం లేనివారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోకూడదని భావిస్తున్నారు. ముఖ్యంగా రాజ్యసభ, ఎమ్మెల్సీలను మాత్రమే పార్టీలోకి తీసుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రాజ్యసభలో టిడిపికి కనీస ప్రాతినిధ్యం లేదు. 2019 ఎన్నికల్లో టిడిపి కేవలం 23 స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. అందుకే గత ఐదేళ్లుగా రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు టిడిపికి చిక్కలేదు. ఆ రెండు పెద్ద సభల్లో టిడిపి ప్రాతినిధ్యం తగ్గుతూ వచ్చింది. ముఖ్యంగా రాజ్యసభ సీట్లు తగ్గుముఖం పట్టడం ఆ పార్టీకి లోటే. పార్టీ ఆవిర్భావం నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేకపోవడం ఇదే తొలిసారి. చివరిగా ఉన్న సభ్యుడు కనకమెడల రవీంద్ర కుమార్ కూడా ఎన్నికలకు ముందు పదవీ విరమణ చేశారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయినా.. శాసనమండలిలో మాత్రం టిడిపికి ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఉండేవారు. అయితే ఒక్కొక్కరు పదవీ విరమణ చేస్తుండడంతో ఖాళీ అవుతూ వచ్చింది. అయితే పట్టభద్రులతో పాటు ఎమ్మెల్యేల కోటా కింద గత ఏడాది నలుగురు ఎమ్మెల్సీలు టిడిపి తరపున గెలిచారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి టిడిపి అభ్యర్థులే ఘనవిజయం సాధించారు. మరోవైపు ఎమ్మెల్యేల కోట కింద అనూహ్యంగా పంచుమర్తి అనురాధ సైతం గెలిచారు. ప్రస్తుతం శాసనమండలిలో తెలుగుదేశం పార్టీకి 8 మంది వరకు ఎమ్మెల్సీలు ఉన్నారు. అదే వైసీపీకి 38 మంది వరకు ఉన్నారు. అందుకే వీలైనంతవరకు ఎమ్మెల్సీలను తమ వైపు లాక్కోవాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయిస్తున్నారు. రాజ్యసభలో వైసీపీకి 11 మంది ఎంపీలు ఉన్నారు. నిన్న మోపిదేవి వెంకటరమణ తో పాటు బీదా మస్తాన్ రావు రాజీనామా చేశారు. మరికొందరు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి వైసీపీని వీడారు. కేవలం పార్టీకే కాకుండా పదవులకు రాజీనామా చేశారు. అయితే శాసనమండలి, రాజ్యసభల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వల్లే చంద్రబాబు వారిని చేర్చుకుంటున్నారని తెలుస్తోంది. అయితే మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన చాలామంది నేతలు వైసిపికి గుడ్ బై చెప్పారు. వారి విషయంలో మాత్రం చంద్రబాబు ఎటువంటి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాజ్యసభ, శాసనమండలిలో ప్రాతినిధ్యం పెంచుకోవడం అవసరం కాబట్టి వారితో రాజీనామా చేయిస్తున్నారు. పార్టీలో చేర్చుకుంటున్నారు.

# అంతుచిక్కని రోజా వ్యూహం....



తిరుపతి, సెప్టెంబర్ 2,మాజీ మంత్రి రోజా పొలిటికల్ ఫ్యూచర్‌పై ఆసక్తికర చర్చ జరుగుతోంది. వైసీపీతో కటీఫ్‌కు సిద్ధపడుతున్నారనే ప్రచారాన్ని తాజాగా ఖండించిన రోజా? ఇంకా కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా సస్పెన్స్ కంటిన్యూ చేస్తున్నారని అంటున్నారు. తన సోషల్ మీడియా అకౌంట్లలో వైసీపీ అధినేత జగన్ ఫొటోను? వైసీపీ పేరును రోజా తొలగించినట్లు ఇటీవల ప్రచారం జరిగింది. తమిళ రాజకీయాల్లోకి వెళ్లనున్నందునే ఆమె ఇలా జగన్ ఫొటోను తొలగించారని విమర్శలు వినిపించాయి. ఐతే తమిళ రాజకీయాల్లోకి వెళతానని తన ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని చెబుతున్న రోజా?. తన సోషల్ మీడియా అకౌంట్ల నుంచి వైసీపీ, జగన్ ఫొటోను ఎందుకు తొలగించారో చెప్పకపోవడమే అనుమానాలను తావిస్తోందంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ మంత్రి రోజా దాదాపు రెండున్నర నెలలుగా సైలెంట్‌గానే ఉంటూ వస్తున్నారు. గుళ్లూ గోపురాల చుట్టూ తిరుగుతూ రాజకీయాలకు తనకు ఏం సంబంధం లేనట్లే వ్యవహరించారు. ఇదే సమయంలో తన సొంత నియోజకవర్గం నగరిలో పార్టీ నేతల నుంచి సహాయ నిరాకరణ ఎదుర్కొంటున్న రోజా?. పక్కనే ఉన్న తమిళనాడు రాజకీయాలపై ఫోకస్ చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. రోజా తమిళ పాలిటిక్స్‌పై నెల రోజుల నుంచి ఉధృత ప్రచారం జరిగినా? ఆమె ఇన్నాళ్లు నోరు విప్పలేదు. గత వారం చెన్నైలో తమిళ పత్రిక ఇంటర్వ్యూ ఇచ్చిన రోజా?. తనకు విజయ్ పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదని చెప్పారు. అయితే రోజా రాజకీయ ప్రస్థానంపై తెలుగునాట ప్రచారం జరిగితే.. ఆమె తమిళ గడ్డపై ఇంటర్వ్యూ ఇవ్వడంపైనా అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. తమిళనాడులో తన కోసం చర్చ జరిగేలా ఆమె ఆ ఇంటర్వ్యూ ఇచ్చారా? అంటూ రోజా ప్రత్యర్థులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. దీంతో తాజాగా తిరుమల వచ్చిన రోజా పార్టీ మార్పుపై ఊహాగానాలను కొట్టిపడేశారు. మరోవైపు రోజా రాజకీయ ప్రత్యర్థులు మాత్రం? విమర్శల దాడిని కొనసాగిస్తూనే ఉన్నారు. తమిళనాడులో విజయ్ పార్టీ నుంచి ఆహ్వానం లేకపోవడం వల్లనే ఆమె ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారని మరో ప్రచారం తెరపైకి తెచ్చారు. నేను ఎక్కడికీ వెళ్లను మొర్రో అంటూ రోజా మొత్తుకున్న ఆమె ప్రత్యర్థుల విమర్శల వ్యూహం నుంచి తప్పించుకోలేకపోతున్నారు. రోజా ఏం చేసినా, అందులో రంధ్రాన్వేషణ చేస్తూ రాజకీయంగా ఆమెను ఇరుకున పెడుతున్నట్లు చెబుతున్నారు. అధికార పార్టీకి టార్గెట్‌గా మారిన రోజా కొన్నాళ్లుగా ఏపీ రాజకీయ అంశాలకు దూరంగా ఉన్నారు. అటు తమిళనాడులో అవకాశం లేదని తేలిపోవడంతోనే ఇప్పుడు ఏపీకి వచ్చి మళ్లీ తన ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారంటున్నారు. ఇప్పటికే నగరిలో రోజా ఆస్తులను విక్రయించేస్తున్నారని.. ఆమెను నగరి వైసీపీ ఇన్‌చార్జిగా తప్పించవచ్చనే ఊహాగానాల నడుమ మళ్లీ పార్టీకి దగ్గరయ్యేందుకు ప్రభుత్వంపై విమర్శలకు దిగారని అంటున్నారు. మొత్తానికి 80 రోజుల తర్వాత రోజా మౌనవ్రతాన్ని వీడినా? ప్రత్యర్థుల విమర్శల దాడి తగ్గకపోవడమే హాట్‌టాపిక్‌గా మారింది.

## అతిగా వ్యవహరిస్తున్న ఐఏఎస్, ఐపీఎస్

### అపఖ్యాతి మూట కట్టుకుంటున్నఅధికారులు

విజయవాడ, సెప్టెంబర్ 2,ప్రభుత్వాలు మారిన ప్రతిసారి అధికారులు మారడం కామన్. తమకు నచ్చిన అధికారులను, తాము మెచ్చిన ఉద్యోగులను నియమించుకోవడం సర్వసాధారణం. అయితే అది ఇటీవల మరింత విస్తృతం అయ్యింది. నచ్చని అధికారులను సాధారణ పరిపాలన శాఖకు సరెండర్ చేయడం, డిజిపి ఆఫీస్ కి రిపోర్టు చేయమనడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రభుత్వాలు మారినప్పుడు గిట్టని అధికారులను అప్రధాన్య పోస్టుల్లో నియమించేవారు. చూసి చూడనట్టుగా విడిచి పెట్టేవారు. కానీ ఇప్పుడు అలా కాదు. ఆ ప్రభుత్వానికి సహకరించారు.. ఆ ప్రభుత్వ పెద్దలకు వెన్నుదన్నుగా నిలిచారు.. అంతటితో ఆగకుండా ప్రభుత్వ ఆదేశాలతో తమను వేధించారు అన్నది హైలెట్ అవుతోంది. అప్పటి పాలకుల ఆదేశాలు పాటించిన అధికారులు టార్గెట్ అవుతున్నారు. అప్రాధాన్య పోస్టులే కాదు.. వారు అసలు అధికారులే కాదన్నట్టు.. చిన్నపాటి ఉద్యోగులుగా కూడా చూడడం లేదు. కనీసం వారికి పోస్టింగ్ ఇవ్వడం లేదు కదా.. నేరుగా రెండు పూటలా వచ్చి సంతకాలు పెట్టమని చెబుతున్నారు. ఖాళీగా కార్యాలయంలో కూర్చోవాలని ఆదేశాలు ఇస్తున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో చాలామంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అతిగా వ్యవహరించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలను పాటిస్తూ ప్రత్యర్థులను వేధించారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో అలా వేధించిన అధికారులను వెంటాడడం ప్రారంభించారు. 19 మంది ఐపీఎస్ అధికారులకు అసలు పోస్టింగులు ఇవ్వలేదు. అయితే ప్రతిరోజు వారు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు డిజిపి కార్యాలయంలో కూర్చోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే ఇలా ఆదేశాలు ఇచ్చిన డిజిపి కూడా ఒక అధికారి కావడం విశేషం. ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారి రాజకీయ ప్రత్యర్థులను వేధించడం అనేది కామన్. కానీ అంతకుమించి ఇప్పుడు అధికారులు వేధింపులకు గురవుతున్నారు. ఇలా వేధిస్తున్నది కూడా అధికారులే. ప్రభుత్వ పెద్దలు చెప్పారనో, ప్రమోషన్ల కోసమనో వారి ఆదేశాలు పాటిస్తే మూల్యం చెల్లించుకునేది కూడా అధికారులే. అందుకే ప్రభుత్వాల ఆదేశాల కంటే తమ మనస్సాక్షిని అధికారులు నమ్ముకోవడం ముఖ్యం. ప్రాథమిక స్థాయి నుంచి చదువులో ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చుంటారు. కానీ రాజకీయ నేతలు చేసిన తప్పిదాలకు తాము మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న విషయాన్ని అధికారులు గ్రహించుకోవాలి. ప్రభుత్వాల పదవీకాలం ఐదేళ్లు. కానీ ప్రభుత్వ అధికారుల సర్వీస్ 60 ఏళ్లు. కానీ ఐదేళ్ల పాటు పదవిలో ఉంటున్న నేతల ఆదేశాలను పాటించి.. 60 ఏళ్ల సర్వీస్ ఉన్న అధికారులు మూల్యం చెల్లించుకుంటున్నారు. జైలుకు వెళ్తున్నారు. నేతలు జైలుకు వెళ్లి పదవులు తెచ్చుకుంటున్నారు. కానీ అధికారులు జైలుకు వెళ్లి అవినీతి మరకను, అప్రతిష్టను మూటగట్టుకుంటున్నారు. అందుకే అధికారుల్లోమార్పు రావాలి. వారు సంఘటితం కావాలి. వారిలో చైతన్యం రావాలి. అప్పుడే మార్పు అనేది సాధ్యపడుతుంది. లేకుంటే అపఖ్యాతి మూటగట్టుకోవడం ఖాయం.

## ఈనెల 7వ తేదీ నుండి 15 వ తేదీ వరకు సూర్య దేవాలయంలో వరసిద్ధి వినాయక నవరాత్రోత్సవములు..



కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 2 విభారె న్యూస్..శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవములు (07-09-2024 నుండి 15-09-2024)..ఈ సంవత్సరం విశేషముగా 9 రోజుల పాటు ప్రతి రోజు మహా గణపతి పూజలు,హోమములు, సహస్ర మోదుక హోమములు భక్తాదులచేత జరుపబడును.గమనిక - భక్తాదులందరికి సంపూర్ణముగా గణపతి హోమ ఫల అనుగ్రహం చేత అన్ని పనులు నిర్విఘ్నముగా పూర్తి కావలననే సంకల్పం తో గణపతి హోమ రుసుమును 1,500 రూ లుగా నిర్ణయించడం జరిగినది.అందుచేత గణపతి హోమములో భక్తాదులు తప్పక అధిక సంఖ్యలోపాల్గొనిస్వామివారికృపకుపాత్రులు కాగలరు.

గణపతి నవరాత్రి పూజలు,సమయములు

1) సెప్టెంబర్ 07నుండి 15 వ తారీఖు వరకు ప్రతి రోజు ఉదయం9-30గంలకు మహాగణపతి హోమములు జరుగును.

2) ప్రతి రోజు సాయం కాలం 6-00 గం లకు సహస్ర మోదుక హోమం జరుగును.


3)ప్రతి రోజు ఉదయం 7గం ల నుండి 11గం ల వరకు స్వయంగా భక్తాదులు గణపతి విగ్రహమునకు అభిషేకములు చేసుకొనవచ్చును.

1) శ్రీ గణపతి హోమం -1,5002)శ్రీ సహస్ర మోదుక గణపతి హోమం3)శ్రీ గణపతి అభిషేకం -2004) 9 రోజుల సంకల్పం -1116గమనిక - దూరప్రాంతాల వారు,రాలేని వారు ఈ 9 రోజుల పాటు స్వామి వారికి జరుగు అభిషేకం, హోమం పూజలలో సంకల్పం చెప్పబడును.. గమనిక - ఈ రోజు నుండే గణపతి హోమమునకు గోత్ర నామాలు నమోదు చెసుకోవడం జరుగుతుంది.భక్తాదులు సహకరించి ముందు గానే చేసుకోగలరు. పూజా వివరములకు సంప్రదించగలరు .జి.వినయ్ కుమార్ శర్మ.. 8919495919 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్: 8896123777..

## రైతు సంక్షేమమే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి లక్ష్యం..



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2 విభారె న్యూస్..ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ముఖ్యమంత్రివర్యులు దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓబిసి జిల్లా చైర్మన్ ,కాశీం వలి, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, యువకాంగ్రెస్ నాయకులు దాదా కలందర్,ఆధ్వర్యంలో స్థానిక వైయస్సార్ సర్కిల్ నందు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడమే రాజశేఖర్ రెడ్డి లక్ష్యమని,ఆయన స్థిరకాలకోరికఅనితెలిపారు.రైతుల రుణమాఫీ,ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రియంబర్స్మెంట్, ప్రాజెక్టుల పూర్తి, ఉద్యోగ అవకాశాలు,పెన్షన్లు, పేదల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. కాంగ్రెస్ అంటే రాజశేఖర్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి అంటేనే కాంగ్రెస్ అని తెలిపారు.దివంగత ముఖ్యమంత్రివర్యులు రాజశేఖర్ రెడ్డి పాలన ఆంధ్ర రాష్ట్రానికి మరొకసారి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫిక్, లోకేష్,విష్ణు, ఇబ్రహీం వలి,షఫీ ,తదితరులు పాల్గొన్నారు.



# జన హృదయ నేత డా" వైఎస్ రాజశేఖర రెడ్డి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాబురావు.





విభారే న్యూస్. సెప్టెంబర్ 2. కర్నూలు ప్రతినిధి జన హృదయ నేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు కె బాబురావు అభిప్రాయపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రులకే ఆదర్శప్రాయుడని కరుడుగట్టిన కాంగ్రెస్ వాది అని దేశం గర్వించదగ్గ నాయకుడని ఆయన స్వచ్ఛమైన పాలన సాగించారని అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డి పూర్తి స్వేచ్ఛ నిచ్చిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంపు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ గృహకల్ప, అత్యవసర వైద్యం కోసం 108,104 వాహనాలు, రైతులకు ఉచిత విద్యుత్, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోని ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారని కె బాబురావు పార్టీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి 15 వ వర్ధంతి కార్యక్రమంలో కార్యకర్తల సమావేశంలో పై విధంగా ఆయన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్థానిక స్టేట్ బ్యాంక్ సర్కిల్ నందలి డాక్టర్ వైయస్ రాజశేఖర్ కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, కర్నూలు అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ జిలాని భాష, కోఆర్డినేషన్ చైర్మన్ అనంతరత్నం, డిసిసి ఉపాధ్యక్షులు రియాజుద్దీన్, కె వెంకటరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శులు పోతుల శేఖర్, సయ్యద్ నవీద్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, జిల్లా కాంగ్రెస్ మీడియా చైర్మన్ అమనుల్లా, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముర్షిద్ పీర్ ఖాద్రి, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డీసిసి కార్యదర్శులు అభి నాయుడు బి సుబ్రహ్మణ్యం, అబ్దుల్ హై, ఎజాస్ అహ్మద్ కాంగ్రెస్ నాయకులు ఎం శివానంద్, సాంబశివుడు, పసుపల ప్రతాపరెడ్డి, రజాక్ వలి, ఖాజా బాషా, షేక్ మాలిక్, జోసఫ్ నోయల్, కేశవరెడ్డి ఐఎన్టియుసి నాయకులు ప్రతాప్ మహిళా కాంగ్రెస్ మద్దమ్మ కె వెంకట లక్ష్మి, సాయి భార్గవి మొదలగువారు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో ఎల్ఐసి పాత్ర గొప్పది- ఆర్టీసీ డిఎం అమర్నాథ్..

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2 విభారె న్యూస్..దేశాభివృద్ధిలో ఎల్ఐసి పాత్ర గొప్పదని ఆర్టిసి డిపో మేనేజర్ అమర్నాథ్, ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పులి నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో ఎల్ఐసి వారోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్ఐసి డే ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యాలయాన్ని అలంకరణ చేసి వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిఎం అమర్నాథ్ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పులి నాయక్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ అధికారులు మహేష్ కుమార్, ఇందిరా, ప్రతాప్ ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు రఘునాథ్ గౌడ్ రాము గోవర్ధన్, డెవలప్మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ నాయకులు సుధాకర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్టీసీ డిఎం, ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ తదితర సిబ్బంది..

రావు, లీయాఫీ బ్రాంచ్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ఐసి దేశ అభివృద్ధిలో ఎంతో గొప్ప పాత్ర పోషిస్తుందని, ఐదు కోట్ల తో ప్రారంభమైన ఎల్ఐసి 68 సంవత్సరాలలో లక్షల కోట్ల టర్న్ అవర్ తో ప్రపంచంలోనే అగ్రగామి ఇన్సూరెన్స్ సంస్థగా నెలకొందన్నారు. మెచ్యూరిటీలు, మరణ చెల్లింపుల్లో 99% పైగానే చెల్లిస్తూ గొప్ప మనలను పొందింది అన్నారు .అంతర్జాతీయ స్థాయిలో ఎల్ఐసి కి అవార్డులు వచ్చాయని, ఇందులో భాగస్వాములైన పాలసీదారులు కూడా ఎల్ఐసి చేసే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములనే అన్నారు. ఎల్ఐసి అభివృద్ధిలో ఏజెంట్ కీలక పాత్రధారులని, నిత్యము కొత్తదాన్ని తెలుసుకుని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. అలాగే బ్రాంచ్ కూడా మంచి వ్యాపారం చేస్తూ ముందుకు పోతుందని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు హంపయ్య బ్రహ్మానంద రెడ్డి పరమేశ్వర్ రెడ్డి మురళీకృష్ణ శ్రీవాణి వీరారెడ్డి వెంకటేష్ వినయ్ రమేష్ రంగస్వామి అనంత భూరలి, వేణుగోపాల్ మధు షబ్బీర్ ప్రసాద్ సూర్యకాంత్ రెడ్డి దేవేంద్ర మూర్తి హనుమంతరావు నరసింహులు రత్నయ్య హరి వీరేష్ ప్రభాకర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు


# ఓపిఎస్ కు ప్రత్యామ్నాయం మరేది సాటి రాదు..

### సెప్టెంబర్ 1 చీకటి రోజు. - ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్..




ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2 విభారె న్యూస్.సిపిఎస్ ను రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సెప్టెంబర్ 1వ తేదీనీ ఒక చీకటి దినంగా పేర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా పాత తాలూకా కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం లో భాగంగా ఎమ్మిగనూరులో ఏపీటీఎఫ్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేయడం జరిగింది.ఇన్నేళ్లు లోప భూయిష్టమైన సిపిఎస్ పై పోరాడుతున్న ఉద్యోగ సంఘాల ఆవేదనను ధృవీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం యుపిఎస్ ను కొత్తగా తెరపైకి తెచ్చింది. అంటే సిపిఎస్ లో జీవన భద్రత లేదు అని కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకున్నట్లు అయిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. ఉద్యోగి వాటాలేని పాత పెన్షన్ విధానాన్ని డిమాండ్ చేస్తుంటే,సి పి ఎస్ కే పై పై మెరుగులు అద్ది,యుపిఎస్ విధానం తేవడం గర్హనీయం అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మన రాష్ట్రంలో కూడా గత ప్రభుత్వం జిపిఎస్ పేరిట కొత్త నాటకానికి తెరతీసింది. 25 సంవత్సరాల సర్వీసు లేని వాళ్లకు పూర్తి పెన్షన్ ఇవ్వము అనడం వల్ల, వివిధ రిజర్వేషన్ కేటగిరీలో నియామకాలలో వయసుకు ఇచ్చిన మినహాయింపుల వల్ల ఉద్యోగం పొందిన వాళ్లు పూర్తి పెన్షన్ను నోచుకోలేరని ఇది వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేయడం అని ఈ సందర్భంగా వారు అభిప్రాయపడ్డారు.అలాగే పెన్షన్ ఫండ్ పై నెలవారి వచ్చే ఆదాయం 50 శాతం కన్నా ఎక్కువ వస్తే, ఆ అదనపు సొమ్మును ఉద్యోగికి దక్కకుండా కాజేయాలనుకోవడం చాలా దుర్మార్గం అని కనుక సిపిఎస్, జిపిఎస్ యుపిఎస్ పేర్లతో ప్రస్తుతం తీసుకొస్తున్న ఏ విధానము కూడా తమకు ఆమోదయోగ్యం కాదని తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమ అనంతరం సంఘ ప్రతినిధులు డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ పరశురాముడు, జిల్లా ఉపాధ్యక్షులు పాపన్న కాసింజీలు,జిల్లా కార్యదర్శిలు రంగనాథ వీరేష, జిల్లా గౌరవాధ్యక్షులు కృష్ణయ్య శెట్టి ఆడిట్ కమిటీ సభ్యులు హేమంత్ కుమార్ ఎమ్మిగనూరు అర్బన్ రూరల్ మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రాఘవరెడ్డి బి కే శీను నాగరాజులు పెద్దకడబూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జట్టప్ప భాషా మంత్రాలయం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధాకర్ నాగరాజులు నందవరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేష్ కుమార్ ప్రసాదులు సీనియర్ నాయకులు రామన్న సుగుణ కుమారు వీర శేఖరు,మహిళా కార్యకర్తలు సోమేశ్వరీ నరసమ్మ అనిత కృష్ణవేణి మరియు అనేకమంది సిపిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలుగు గంగా రైతుల సమస్యలు పరిష్కరిస్తాం





ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 02 విభారె న్యూస్ :- తెలుగు గంగ పరివాహక ప్రాంత రైతుల సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామ రైతులకు సంబంధించిన సమస్యలు రెండు రోజుల క్రితం తమ దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ముఖ్యమంత్రి ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తెలుగు గంగ కాలువ నుంచి నీరు పొలాలకు వెళ్లేందుకు అవసరమైన పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు సాగునీటి సౌకర్యం అందిస్తామన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో రైతుల ఇబ్బందులు గమనించి ఈ సమస్యను సీ.ఈ., యస్.సీ.,ల ద్వారా ప్రిన్సిపల్ సెక్రటరీ వరకు ఫైల్ ని తీసుకెళ్లగలిగామన్నారు. ప్రభుత్వం మారడడంతో సమస్య పరిష్కారం జరగలేదన్నారు. అయితే ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి రావడం తాను ఎమ్మెల్యేగా రావడంతో రైతు సమస్యలు కచ్చితంగా పరిష్కరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. శ్రీరంగాపురం రైతులు తూము కావాలని తమను అడిగారని అధికారులతో సంప్రదించి అంచనా వేయించామని తూము పనులు పూర్తయితే త్వరలోనే శ్రీరంగాపురం వీరబోలు గ్రామాలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సి పి డబ్ల్యూ ఎస్ స్కీం 1997లో ప్రారంభించారని మధ్యలోనే ఆగిపోయింది అన్నారు. 2013లో శోభా నాగిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 6 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు పని పూర్తి చేసేందుకు ప్రయత్నించామన్నారు. ప్రభుత్వం మారడంతో అప్పటి ప్రభుత్వం రైతు సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారులోకి రావడంతో సిపిడబ్ల్యూఎస్ స్కీమ్ ఈరోజు పరిశీలించామన్నారు. ఈ స్కీమ్ ద్వారా చుట్టుపక్కల పది గ్రామాలకు మంచినీటి సమస్య లేకుండా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో మాట్లాడామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్ట విషయం అధికారులతో మాట్లాడి త్వరలో పనులు చేయిస్తామన్నారు. ప్రభుత్వం నిధులు రావడం ఆలస్యమైతే సొంత నిధులతో పనులు చేయిస్తామన్నారు. రుద్రవరం ఏరియా ఫ్యాక్షన్ జోన్ గా ఉండేదని ఎలాగైనా ఈ ప్రాంతాన్ని మార్చాలని ఆలోచనతో తెలుగు గంగ మన ప్రాంతానికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాన్ని చూస్తుంటే కోస్తాంధ్రకు వచ్చిన అనుభూతి కలుగుతుందన్నారు. ఈమె వెంట అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190